ఉచిత యోగా శిక్షణ



జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

ఓర్వలేకనే కాంగ్రెస్ విమర్శలు

నిజాంపేట్: బీజేపీ ఎదుగుదలను ఓర్వలేకనే కాంగ్రెస్ విమర్శలు చేస్తుందని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్ రాజు అన్నారు. బుధవారం బాచుపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జైహింద్ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న సీఎం, ఇతర కాంగ్రెస్ నాయకులను స్వాగతిస్తున్నామన్నారు. కానీ గతంలో ఇదే మల్కాజగిరి పార్లమెంట్ ఎంపీగా ఉన్న ముఖ్యమంత్రి ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఏ ఒక్కసారి కూడా కార్పొరేషన్‌కు వచ్చిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి అయిన తరువాత నిజాంపేట్ కార్పొరేషన్‌కు తొలిసారిగా వస్తున్నారని అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు నీచ బుద్ధితో బీజేపీ ఆపరేషన్ సిందూర్ విజయాన్ని రాజకీయం చేస్తుందని విమర్శలు చేయటం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్, ప్రగతినగర్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి కృషి



ఏసీపీని కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: పేట్ బషీరాబాద్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన బాల గంగిరెడ్డిని బుధవారం పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాలనీ సంక్షేమ సంఘాల సహకారంతో తప్పకుండా నేరాలను కట్టడి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజారెడ్డి, కృష్ణారెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సుచిత్ర సర్కిల్‌లో అన్నదానం

జగద్గిరిగుట్ట: ఎంఎస్‌రెడ్డి లాయిన్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో యంగ్ అచీవర్స్ భోజన సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం సుచిత్ర సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చింతల మానస్ యాదవ్ జన్మదినం సందర్భంగా సుమారు 500 మందికి అన్నదానం చేశారు.

ఘనంగా వీర సావర్కర్ జయంతి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఏనుగు బొమ్మల చౌరస్తాలో బుధవారం ఆర్ఎస్ఎస్ అయోధ్య రామశాఖ ఆధ్వర్యంలో వినాయక దామోదర సావర్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వీర సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, సూర్యనారాయణ, రామారావు, బాలచెన్నారెడ్డి, రామచంద్రనాయక్, శివకుమార్ గుప్తా, రచ్చ చక్రధర్, రామ్ కిశోర్, మధుసూదన్‌రావు, నవీన్, డా.వెంకన్న మేకల, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐ లావణ్యకు నార్కోటిక్ బ్యూరో అప్రిసియేషన్ సర్టిఫికెట్

కుత్బుల్లాపూర్: డ్రగ్స్ కేసులను ఛేదించడంతో పాటు బానిసలైన వ్యక్తులను గుర్తించి వారికి డీ.ఎడిక్షన్ సెంటర్లలో చేర్పించి చికిత్స అందిస్తున్న పేట్‌బషీరాబాద్ ఎస్ఐ లావణ్య సేవలకు గుర్తింపు లభించింది. తెలంగాణ యంటీ నార్కోటిక్ బ్యూరో ఆమెకు అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందజేసింది. బుధవారం తెలంగాణ యంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ ఎస్ఐ లావణ్యకు ప్రశంస పత్రాన్ని అందజేశారు.



నిధులొచ్చినా పనులు ప్రారంభించలే!

'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుగా డ్రైనేజీ నిర్మాణం కోసం టెండర్లు నిర్వహించి నెలలు గడుస్తున్న పనులు ప్రారంభించడం లేదు. దీంతో సమీప కాలనీ వాసులు డ్రైనేజీతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని అడిగితే అదిగో ఇదిగో అంటూ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో అటు గ్రేటర్ ప్రాజెక్ట్ అధికారులు.. ఇటు వాటర్ వర్క్స్ అధికారులు.. మరోవైపు సర్కిల్ అధికారులు డొంక తిరుగుడు సమాధానాలతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.



నెలల తరబడి అక్కడే ఉన్న పైపులు

- డ్రైనేజీ నిర్మాణానికి రూ.1.2 కోట్లతో టెండర్
- అధికారుల మధ్య సమన్వయలోపం
- ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డు నుంచి కల్వర్టు వరకు చుట్టుపక్కల కాలనీవాసులకు డ్రైనేజీ సౌకర్యం కోసం నిధులు మంజూరయ్యాయి. 1.18 కిలోమీటర్ల మేర రూ.1.2 కోట్లతో ఫాక్స్‌సాగర్ కెమికల్ నాలా వరకు భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు కోసం టెండర్లు నిర్వహించారు. ఆయా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పనులు సాగడం లేదు. ఏ ఒక్క అధికారి సరైన సమాధానం చెప్పడం లేదు.

పోల్స్ తొలగించి స్టీల్ బ్రిడ్జి నిర్మించాలి..!

వాటర్‌వర్క్స్ అధికారులు ఈ పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే క్రమంలో అక్కడ ఉన్న 28 విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతేకాకుండా స్థానిక అధికారులతో ప్రణాళికలు రూపొందించి వాటిని తొలగించేందుకు రూ.20 లక్షలు కూడా చెల్లించారు. కొద్ది రోజులు హడావిడి చేసిన అధికారులు ఆ ప్రక్రియ పూర్తికాగానే కొత్త సమస్యను తెరపైకి తెచ్చారు. ఫాక్స్ సాగర్ కెమికల్ నాలా స్టీల్ బ్రిడ్జి పూర్తవుతేనే ఇక్కడ పనులు చేపడతామని మెలిక పెట్టారు. దీంతో డ్రైనేజీ సమస్య ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. ఇదే క్రమంలో స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు కోసం రూ.56 కోట్లు నిధులు కేటాయించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు తెలిసింది. వచ్చే నెల మొదటి వారంలో ఇక్కడ పనులు చేపట్టేందుకు గ్రేటర్ ప్రాజెక్ట్ అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. వాటర్ వర్క్స్ అధికారులు కూడా డ్రైనేజీ పనులను చేపడతామని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థతో పాటు స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, విద్యుత్ పోల్స్ తొలగింపు ప్రక్రియ త్వరగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఉండే సుభాష్ నగర్ పైప్ లైన్ రోడ్డు వెంట అనేక కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. దీంతో డ్రైనేజీ సమస్య ప్రతిరోజు ఎదురవుతూ వచ్చింది. దుర్గంధంతో వ్యాధులు ప్రబలే అవకాశముంది. అధికారుల మధ్య సమన్వయలోపంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

స్టీల్ బ్రిడ్జి ప్రారంభం కాగానే పనులు



డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు విషయంపై ఆయా శాఖల అధికారులకు తెలియజేశాం. వారి నుండి సానుకూల స్పందన వచ్చింది. ప్రస్తుతం స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం అయ్యేవరకు డ్రైనేజీ పనులు జరగవు. రద్దీగా ఉండే ఈ రోడ్డులో పనులు జరగాలంటే సుమారు 6 నెలల సమయం పడుతుంది. అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేసిన తర్వాత పనులు ప్రారంభిస్తాం. ఇప్పటికే సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీకి లేఖ కూడా పంపాం.

– రాజేష్, వాటర్ వర్క్స్ డీజీఎం కుత్బుల్లాపూర్

నేడు జైహింద్ యాత్ర సభ

- ఏర్పాట్లను పర్యవేక్షించిన పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్
- నేటి సభకు హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం, మీనాక్షి నటరాజన్



జైహింద్ యాత్ర ర్యాలీ, సభ గురించి చర్చిస్తున్న టీపీసీసీ చీఫ్ తదితరులు

నిజాంపేట్: ఆపరేషన్ సిందూర్‌ని బీజేపీ రాజకీయాలకు వాడుకుంటుందని, భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణపై ట్రంప్ వ్యాఖ్యలకు మౌనంగా ఉన్న ప్రధాని మోడీ తీరును ఎండగట్టేందుకు జైహింద్ యాత్ర చేపడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో జైహింద్ యాత్ర ర్యాలీ, సభ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గంలోని కేజీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం సభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఏఐసీసీ మాజీ సర్వీస్ మెన్ కమిటీ చైర్మన్ కల్నల్ రోహిత్ చౌదరి పాల్గొంటున్నారని తెలిపారు. సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు సంపత్‌కుమార్, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి భూపతిరెడ్డి పాల్గొన్నారు.

విజయవంతంగా రోబోటిక్ కార్డియాక్ సర్జరీ



సర్జరీలో పాల్గొన్న మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి వైద్యులు

కుత్బుల్లాపూర్ : ఎస్ఎస్ఐ మంత్రను ఉపయోగించి మొదటి రోబోటిక్ కార్డియాక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. సీటీవీఎస్, రోబోటిక్స్ స్పెషలిస్ట్, సీనియర్ కన్సలెంట్ డాక్టర్ హరీష్ బాదామి నేతృత్వంలో కార్డియాక్ బృందం అధిక కచ్చితత్వంతో కూడిన శస్త్ర చికిత్స శ్రేణితో కార్డియాక్ ప్రోగ్రాంను ప్రారంభించారు. రోబోటిక్ ఆట్రియల్ స్పెషల్ డిఫెక్ట్, లిమా తొలగింపు, రోబోటిక్ మిట్రల్ వాల్వ్ రిప్లేస్‌మెంట్‌లను నిర్వహించారు. ఈ ప్రక్రియ జైపూర్‌లోని మణిపాల్ ఆసుపత్రికి చెందిన కార్డియాక్ సర్జన్ డాక్టర్ లలిత్ మాలిక్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ బాదామి మాట్లాడుతూ.. రోబోటిక్ కార్డియక్ సర్జరీతో కచ్చితమైన ఫలితంతో పాటు రోగి త్వరగా కోలుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. డాక్టర్ లలిత్ మాలిక్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఐ మంత్ర ఎంత కచ్చితంగా పనిచేస్తుందో ప్రత్యక్షంగా గమనించామని, భారతదేశ వ్యాప్తంగా కార్డియాక్ కేంద్రాల అత్యున్నత డిమాండ్లను తీర్చడానికి ఈ వ్యవస్థ ఎంతో దోహదపడుతుందన్నారు.

విచ్చలవిడిగా వాటర్ ప్లాంట్లు!

- అనుమతి లేకుండా ఒకే బస్తీలో 3 కేంద్రాలు
- గతంలో సీజ్ చేసినా మళ్లీ ప్రారంభం
- పట్టించుకోని అధికారులు



వాటర్ ప్లాంట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

జగద్గిరిగుట్ట: డివిజన్‌లో వాటర్ ప్లాంట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఒకే బస్తీలో 3 కేంద్రాలున్నాయి. వాటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్లాంట్ నిర్వాహకులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడే అధికారులు స్పందించి సీజ్ చేస్తున్నారు. తిరిగి వారంలోపే ఆ ప్లాంట్‌లు మళ్లీ ప్రారంభం అవుతున్నాయి. డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ మార్గ్‌లో కొన్ని రోజులుగా వాటర్ ప్లాంట్‌లు వెలుస్తున్నాయి. ఏకంగా 3 ప్లాంట్లను ప్రారంభించడం విశేషం. సుమారు 5 వేల నుంచి 6 వేల జనాభా కలిగిన ఈ బస్తీలో 3 వాటర్ ప్లాంట్లు అక్రమంగా నడుస్తున్నాయి. 4 నెలల క్రితం ఈ విషయమై రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కానీ 10 రోజులు తిరిగే లోపే మళ్లీ ప్రారంభించారు. అనంతరం అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేని ఈ నీటి ప్లాంట్ల వల్ల తమకు తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌లు వద్దని స్థానికులు నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో జలమండలి ప్రధాన కార్యాలయంలో, ఎమ్మెల్యే వివేకానంద్‌కు, కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేసి తమగోడును వెల్లబోసుకున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి అక్రమంగా వెలిసిన వాటర్‌ప్లాంట్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

మోతీనగర్ : మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు బుధవారం జరిగాయి. ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించారు. ఎస్సీ కేటగిరి నుంచి కంచర్ల శ్రీనివాసరావు, మహిళల కేటగిరి నుంచి పి సుధారాణి, రుక్మిణి, జనరల్ కేటగిరి నుంచి డాక్టర్ ఎస్ వి ప్రసాద్, అంజిరెడ్డి, బి సీతారామయ్య, పీఏఎస్ఎన్ మూర్తి, ఆర్ శ్రీనివాసన్, తులసి దాసు గెలుపొందారు. డాక్టర్ ఎస్ వి ప్రసాద్ ప్యానల్ నుంచి ఆరుగురు, ఎస్ అంజిరెడ్డి ప్యానల్ నుంచి ఆరుగురు గెలుపొందారు.

పేద విద్యార్థినికి ఏఈ ఆర్థికసాయం

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు ఆర్థికసాయం అందించడం సంతోషాన్ని ఇస్తుందని విద్యుత్ శాఖ ఏఈ పెరుమాళ్ల వెంకటలక్ష్మి అన్నారు. గాజులరామారానికి చెందిన దూసి శ్రీను కుమార్తె హర్షిత పదో తరగతి ఫలితాల్లో 431మార్కులు సాధించింది. పై చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురావడంతో ఈవిషయాన్ని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు రవినాయక్‌కు తెలిపారు. ఆయన ఈ విషయాన్ని ఏఈ వెంకటలక్ష్మికి తెలపడంతో బుధవారం రూ.10 వేల చెక్కును కుటుంబ సభ్యుల ద్వారా హర్షితకు అందజేశారు. అదేవిధంగా భవిష్యత్‌లో హర్షిత చదువు కోసం ఆర్థికసాయం అందించడంలో దోహద పడతానని వెంకటలక్ష్మి తెలిపారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఏఈ భర్త

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులను పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ మన్యం ప్రాంతానికి చెందిన నారాయణరావు(31) కొంపల్లిలోని మల్లన్న కాలనీలో ఉంటూ వెల్డర్‌గా పని స్తున్నాడు. ఈ నెల 16న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో మల్లన్న కాలనీలో గోదావరి ఫాస్ట్‌ఫుడ్స్ సెంటర్ వద్ద మద్యం మత్తులో నారాయణరావుతో కండ్లకోయకు చెందిన అనీల్‌కుమార్, పవన్‌కుమార్ గొడవపడ్డారు. నారాయణరావుపై విచక్షణ రహితంగా రాళ్లతో దాడి చేయడంతో అతను తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా.. పరిస్థితి విషమించడంతో ఈ నెల 27 రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వృద్ధుడి అదృశ్యం

సుభాష్‌నగర్: వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పులివెందులకు చెందిన రామిరెడ్డి (70) పది రోజుల క్రితం సూరారం వైష్ణవి నగర్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చాడు. ఈ నెల 27న ఉదయం 7 గంటలకు వాకింగ్ వెళ్లిన అతను ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. వృద్ధుడి అల్లుడు మనోహర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామిరెడ్డి(ఫైల్)

2న ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్, సీసాల బస్తీలో శ్రీ వైష్ణవి దుర్గ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని జూన్ 2న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం మహా చండీ హోమం, సాయంత్రం 5 గంటలకు బ్రహ్మ రథోత్సవం, పల్లకీసేవ, కుంభ దీపోత్సవం, మహామంగళ హారతి, అన్నదాన కార్యాక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ పేర్కొంది.



ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లు

వీధి వ్యాపారులను ఆదుకోవాలి

కూకట్‌పల్లి: వీధి వ్యాపారులను ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కోరారు. ఈ మేరకు బుధవారం బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌తో కలిసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసాపేట కూడలి నుంచి ఆంజనేయ నగర్ వెళ్లే దారిలో రోడ్డు విస్తరణలో భాగంగా కొన్ని రోజుల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు దుకాణాలను తొలగించారన్నారు. 30 ఏళ్లగా రోడ్డు పక్కనే 8 మంది దుకాణదారులు వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఈ దుకాణాలను గతంలో బండారు దత్తాత్రేయ ఎంపీగా, ఎమ్మెల్యే పీజేఆర్ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యేల నిధులతో దుకాణ సముదాయాలను నిర్మించారని వివరించారు. ఎంతో కాలంగా వ్యాపారం చేసుకుంటు జీవిస్తున్న వారిని అధికారులు ఎటువంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా తొలగించి ఆస్తి నష్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ తరువాత మిగులుతున్న రోడ్డు పక్కనే ఉన్న 20 అడుగుల స్థలాన్ని బాధిత దుకాణదారులకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు.



చెత్తను తరలించరూ!

పార్కు స్థలంలో పేరుకుపోయిన చెత్త



కాలనీలలో సేకరించిన చెత్తను ఒక చోట వేసి 12 గంటల వరకు కూడా తీయకపోవడంతో చెల్లాచెదురుగా పడి దుర్వాసన వస్తుంది. రాజీవ్ గృహకల్పలో బ్లాక్ నెంబర్ 1 నుంచి 5 బ్లాక్ వరకు చెత్తను సేకరించే ఆటోవాళ్లకు డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని తమ ముందున్న పార్కు వద్ద చెత్తను వేస్తున్నారు. కుప్పలుగా పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. – జగద్గిరిగుట్ట



మోడల్ మార్కెట్ సమీపంలో..

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

- అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి
- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల విషయంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గండిమైసమ్మ – మియాపూర్, బహదూర్‌పల్లి –కొంపల్లి రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. అదే విధంగా మల్లంపేట్ రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ రద్దీని నివారించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మిగిలిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, తహసీల్దార్ మతిన్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవంలో..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీనివాస్‌నగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయ ద్వితీయ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. అరుణ్ గురుస్వామి, బ్రహ్మ శ్రీ రాజన్ నంబూద్రి గురు స్వామి, నాగార్జున ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ ఎన్ఎంసీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ప్రణయయాదవ్, రాఘవేంద్రరావు, రవి కిరణ్, బాలాజీ నాయక్, బొర్రా దేవి, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.